# కళాజ్యోతి

శ్రీ రాయసం సుందర వెంకటరమణ

మానవుడి ఆలోచనా శక్తి, నటనా చాతుర్యము అత్యద్భుతము. ఏవేవో ఊహాలతో జీవితాన్ని ఉత్సాహంగా చేసుకొంటారు కొందరు మహానుభావులు. అన్నీ వున్నా అర్థంలేని ఆవేశాలతో ఆశయాలతో జీవితాన్ని అంధకారం చేసుకొంటారు మరికొందరు. నిర్మలంగా, నిశ్చలంగా వున్న నీలాకాశం తనకోసమై నిర్మింపపడిందనుకొంటాడు మానవుడు మాహళ్లోకంలో. మలయమారుతం తన కోసమై తన సుఖంకోసమై పంపబడిందని గర్వపడతాడు. తెరమీద బొమ్మవున్న కొద్ది కాలంలో ఎంత ప్రకాశవంతంగా, దేదీప్యమానంగా కనపడ ప్రయత్నిస్తుందో మానవుని జీవితాన్ని అంత సుఖ ప్రదంగా చేసుకోవలెననుకొంటాడు; ఆప్రయత్నంలో ఎంత నీచానికైనా పాల్పడ్తాడు. అది మానవుని జీవిత రహస్యము. జీవితమంటె కేవలం ఒకానొక వ్యక్తి నిజస్వభావము తెలుసుకోడానికి నిర్మింపబడ్డ రంగస్థలమని కొందరి ఊహ. ఒక్క నిరాశలో జీవితాన్ని అతఃపాతాళానికి తొక్కోవడం వెఱ్ఱితనం. కొందరు జరిగిన విషయాలు సంఘటనలతోనే క్రుంగిపోతారు. మఱికొందరు ఆ బాధను తోడిమానవసోదరులతో చెప్పుకొని హృదయక్షోభ తగ్గించుకొంటారు. కొందరు సోదరభావమును పెంపొందించుచు, అందరి యందును తన యందును వున్న ఆత్మలపోల్చిచూచుకొని ఆనందించుచుందురు. అదే సర్వమానవ సౌభ్రాతృత్వములోని సారాంశము. అట్టి అనేకులలో నేనొకడను. దయయుంచి "ఎవరు నీవు"యని యడగరనుకుంటా మా పాఠక మహాశయులు. ఈ కథకు సంబంధించి విజయ శేఖర్ మిత్రుణ్ణి.

౧

రెండు సంవత్సరాల క్రితం వేసవి రోహిణికార్తె దినాలలో ఒక సాయంకాలం జరిగిన విషయం. నేను శేఖర్ జ్యోతి కేఫ్‌లో కాఫీతాగి సంతకు పోయ్యాం. రకరకాలదుకాణాలన్నీ దాటుకొని ఒక చిన్న పూలకొట్టుకు చేరాం. మీరు యీ పాటికే నవ్వుకుంటున్నారుకదూ! సంతకు పొయ్యేవాళ్లు – అందులో మాలాంటి మాడరన్ యువకులు – నవయువకులు సంతకుపోతే చూడవలసినవి యేమిలేకనా! ఆపూలకొట్టుకు పోవడంలో ఉద్దేశ్యమేమిటి

యని ఆలోచిస్తుంటారు. మేము ఆ కొట్టుకు పోకుండా యుంటె నేను యీ కథ వ్రాసే అవకాశం లేక పొయ్యేది. ఆ పూలకొట్టుకు కొంత దూరంలో నిలబడ్డాం. ఆ కొట్టులో యిరువది సంవత్సరాలకు మించని యువతి కూర్చొని యుంది. ఎందరో పూలుకొనడానికి వచ్చారు. కొంటున్నారు. ముఖములో స్వేద బిందువులు - అలసట కనపడుతున్నా లెక్క చెయ్యకుండా పూలనిచ్చిడబ్బుతీసుకొంటున్నది. "ఏం శేఖర్ మామూలు ప్రకారంగా పూలనన్నిటిని కొనేసేయి డబ్బిచ్చి పోదాం, ఆలోచనెందుకు యింకా. నాకు అర్థంకావడంలేదు. నీవు అలా చేయడంలో అభిప్రాయము" అన్నాను నేను. "రమణా నీవునన్ను యిలా అపార్థం చేసుకుంటావని నేనెప్పుడు అనుకోలేదు. ఆమె ముఖం చూస్తే అర్థంకాని ఆవేదన, యేదో జాలి బయలుదేరుతాయి నాలో. అదేమో పూర్వజన్మసంబంధం కాబోలు! నేను దివ్యజ్ఞానసమాజానికి సంబంధించిన పుస్తకాల్లో చదివినప్పుడర్థంకాలేదు. ఇప్పుడది సత్యమని నిర్ధారణ చేసుకొన్నాను. ఈ దినం వాళ్లింటికి పోయి వాళ్లమ్మతో మాట్లాడాలి. అందకనే బండ్లో రాలేదు" అన్నాడు శేఖర్. అలాగే కానీ అన్నట్లు తలూపాను.

## 3

రెండు ఘంటలు గడిచింది మేము సంత దగ్గరికి పోయి యిప్పటికి. చెరొక సోడా సేవించి వీధిలోపడ్డాము. మేమిద్దరం ముందు, మాకు రెండు అడుగుల వెనుకగా చిన్న పూలకొట్లో చూచినయువతి 'కళజ్యోతి' నడుస్తున్నాము. "ఎన్ని సంవత్సరాలుగా పూలనమ్ముతున్నావు కళా" అని ప్రశ్నించాడు శేఖర్. 'పదిసంవత్సరాలుగా' అంది ముభావంగా. అంధకారంగా వున్న గుడిసెలోకి పోయింది. దీపం వెలిగించింది. "అమ్మా ఎవరో నీతో మాట్లాడడానికి వచ్చారు." అంది కళ. 50 ఏండ్లు పైబడ్డ స్త్రీ బయటికి వచ్చింది. 'అలాగనా అమ్మా! పాపము యెవరో పెద్ద మనుష్యులుగాయున్నారు. వాళ్లు కూర్చోడానికి మంచంకుక్కి తప్ప యేముంది మనయింట్లో' అంది ముసలావిడ బాధవ్యక్తపరుస్తూ. "ఫరవాలేదులేండి ఇలా అరుగుమీద కూర్చుంటాము-పండు వెన్నెల్లో," అన్నా కవిత్వ ధోరణిలో. ఎదుటి అరుగుమీద ముసలావిడ కూర్చుంది. "కళ అమ్మా ప్రతిదినం మిగిలిపోయిన పూలన్ని వీళ్లేనే కొనేది. హృదయమిప్పి మాట్లాడుతారు, కనికరాన్ని కనపరుస్తారు, అందువల్లే వీళ్లతో మాట్లాడినంతసేపు బాధలనూ, మన ముందేస్థితిని మర్చిపోతాను" అంది.

(సశేషము)